## ఇవిఎం గోదాంలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ లో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంప్ లో ని ఈ.వీ.ఎం. లను భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల ఈ.వీ.ఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సి.సి. కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తత తో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ లత,జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్,రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలి




### కలెక్టర్ సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. జిల్లాలో ఇసుక నిల్వ ప్రాంతాల గుర్తింపు, భూగర్భ జల శాఖ సాధ్యాసాధ్యాల నివేదికలు, స్థానిక అవసరాలు , ప్రభుత్వ పనుల కోసం ఇసుక అందుబాటుపై జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధ్యక్షతన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేవని, వర్షాకాలం అనంతరం పరిస్థితులను సమీక్షించి ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ముగిసిన తర్వాత భూగర్భ జల శాఖ ద్వారా సమగ్ర అధ్యయనాలు నిర్వహించి భవిష్యత్తులో ఇసుక తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బలహీన వర్గాల గృహ నిర్మాణాల కోసం మినహా ప్రతి ఇసుక లావాదేవీ ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక తవ్వకం, రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ధర్మపురి మండల పరిధిలో గోదావరి నదిలో ప్రస్తుతం అధికారికంగా ఎటువంటి ఇసుక తవ్వకాల అనుమతులు లేవని కలెక్టర్ తెలిపారు.అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే సమయంలో గోదావరి పరివాహక ప్రాంతంలో అనువైన ఇసుక నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఇబ్రహీంపట్నం నుంచి గోదావరి నది పరిధిలో అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ గనుల అభివృద్ధి సంస్థకు అప్పగించే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో భూగర్భ జల శాఖ సమర్పించిన సాధ్యాసాధ్యాల నివేదికలను కమిటీ పరిశీలించింది. పెద్దవాగు, గోదావరి నదిలో గుర్తించిన ఇసుక నిల్వ ప్రాంతాలపై సంబంధిత శాఖల అధికారులు నిర్వహించిన క్షేత్ర స్థాయి పరిశీలన వివరాలను సమీక్షించింది. భూగర్భ జల శాఖ నివేదికల ప్రకారం కొన్ని ప్రాంతాలు ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు అనుకూలంగా లేవని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదన్, జి. నర్సింహారావు, దివాకర్ రెడ్డి, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఈ. మురళి, గనులు మరియు భూగర్భశాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల కోసమే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు



### అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**ప్రజాపక్షం/చెన్నూర్:** ప్రజల కోసమే ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సభల్లో భాగంగా గురువారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని వార్డు సభలు, హాజీపూర్ మండలంలోని అక్కపల్లి గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. అక్కపల్లి గ్రామసభలో ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామస్తులు అవగాహన కలిగి ఉండాలని, ఇంటి వద్దనే వ్యర్థాలను పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా వేరు చేయాలని సూచించారు. జల సంరక్షణ మన సంరక్షణ కార్యక్రమం కింద నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని కోరారు. చల్లాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో నిర్మించవలసిన భూగర్భ మరుగుదొడ్ల పనులకు సంబంధించి మార్కింగ్‌లు పూర్తి చేయించి పనులను వేగవంతం చేయాలని సర్పంచ్, అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 6, 8 వార్డుల ప్రత్యేక సభల్లో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వృథాను నివారించడం, ప్రజా ఆరోగ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు, పోలీసు శాఖ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ ప్రగతి, అభివృద్ధిపై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్–అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై అధికారులు సూచించిన విషయాలను ప్రజలు పాటించాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ – 2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంటల వైవిధ్యంపై రైతులు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని, ఎల్నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి, తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీ నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, జిల్లా వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ స్వాతి, తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ స్నిగ్ధ, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# చొప్పదండిలో ఆకర్షణీయంగా భారీ హోర్డింగ్

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి పట్టణంలో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. ప్రధాన రహదారిపై ఓ భవనంపై ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ ఏర్పాటు చేసిన ఈ హోర్డింగ్ లోని వాఖ్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. అతనొక భరోసా.. అతనొక నమ్మకం.. అతనొక విశ్వాసం.. అతనొక గుండె ధైర్యం అంటూ చొప్పదండి శాసనసభ్యులు డా.మేడిపల్లి సత్యమన్నకి జన్మదిన శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, పేదల పెన్నిధి, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి చొప్పదండి అభివృద్ధి కోసం 24*7 అహర్నిశలు కష్టపడుతున్న మీరు మంత్రిగా అత్యున్నత స్థానాలు అధిరోహించాలని చొప్పదండి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మీరు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ అని కొత్తూరి మహేశ్ శుభాకాంక్షలు తెలిపారు. హ్యాపీ బర్త్‌డే అన్న అంటూ ఏర్పాటు చేసిన ఈ భారీ హోర్డింగ్ ఎమ్మెల్యే సత్యమన్న మంత్రి కావాలన్న ప్రజల ఆకాంక్షను అభిమానుల అభిమానాన్ని చాటుతోంది. ఈ హోర్డింగ్ పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉండడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.



## ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మండల విద్యాధికారి హరిప్రసాద్ ఆదేశాల మేరకు పాఠ్యపుస్తకాలను గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ కేంద్రం నుండి ఉత్సాహంగా తీసుకువెళ్లారు. సకాలంలో పుస్తకాలు అందడం పట్ల విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో రౌతు సంపత్,శ్రీనివాస్, కుమార్,రమేష్ తోపాటు తదితరులున్నారు.

## శస్త్ర చికిత్సలకు నిలయంగా పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** శస్త్ర చికిత్సలకు నిలయంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సేవలందిస్తూ పేద రోగుల పట్ల వరంగా మారిందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గురువారం రోజున పెద్దపల్లి జిల్లా కల్వచర్ల గ్రామానికి చెందిన 21 సంవత్సరాల యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో జిల్లా ఆసుపత్రికి రాగా వైద్యులు పరీక్షలు నిర్వహించి మూత్రనాళంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం నిపుణులైన వైద్యుల బృందం విజయవంతంగా డీజే స్టెంట్ అమర్చడం జరిగిందనీ ఆసుపత్రి సూపర్ అండి డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు.అలాగే కొలనూరు గ్రామానికి చెందిన 28 సంవత్సరాల మహిళకు రెండు నెలల క్రితం మూత్రనాళ సమస్య కారణంగా ఆసుపత్రి లో డీజే స్టెంట్ అమర్చగా,ఆమెకు డీజే స్టెంట్‌ను విజయవంతంగా తొలగించడం జరిగిందనీ ఈ రెండు శస్త్రచికిత్సల లో డాక్టర్ సంతోష్ రెడ్డి(యూరాలజిస్ట్), డాక్టర్ రాము (జనరల్ సర్జన్) మరియు డాక్టర్ కృష్ణవేణి (అనేస్తేషియా) పాల్గొన్నారని,ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలలో పాల్గొన్న వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రొస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా తనను కలవచ్చని, హాస్పిటల్ లో ఉన్న సమయం లో సానిటేషన్ గురించి గాని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని మరియు ఏ ఇతర సమస్య ఉన్నా నర్సింగ్ సూపరింటెండెంట్ ని,RMOని సంప్రదించాలని, లేదా ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో వేయాలని,వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తామని, ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదని తెలియచేసారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జమ్మికుంట మున్సిపాలిటీలోని 12, 19, 20, 23, 24, 26 వార్డులలో చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ జి.మల్లికార్జున స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్, కమీషనర్‌లు మాట్లాడుతూ వార్డులలో ఉన్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల అమలు, జల్ సంచయ్‌జల్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా రైన్ వాటర్ హార్వేస్టింగ్ నిర్మాణాల ఏర్పాటు, డ్రైన్ పూడికతీత, శుభ్రపరిచే పనులు, రుతుపవనాల సన్నద్ధత ప్రణాళికలు, తాగు నీటి సరఫరా, నిర్వహణ నీటి నిల్వల నివారణ, పారిశుద్ధ్య చర్యలు, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహమ్మద్ ముంతాజ్ అలీ, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, భాస్కర్, పలువురు వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇంచార్జ్ జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు మంథని రేంజ్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అడవులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, జీవవైవిధ్య పరిరక్షణకు అటవీ సంపద ఎంతో అవసరమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో, భూగర్భ జలాల సంరక్షణలో, స్వచ్ఛమైన గాలి అందించడంలో అడవుల ప్రాధాన్యతను వివరించారు."పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమురయ్య, డి. శ్రావంతి, ప్రదీప్, పి. కనకజ్యోతి, కల్పన, రమేష్,శంకర్, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థలు దోపిడీని అరికట్టాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎబివిపి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగు నీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సౌకర్యాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్లు మరియు ఇతర విద్యా సామగ్రి అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి జంగపల్లి అరవింద్, నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, సంజయ్,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై బిజెపి సర్కార్ మోసపూరిత ప్రకటనలు




**ప్రజాపక్షం/కరీంనగర్ :** 2016లోనే మంజూరైన జాతీయ రహదారిని ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్తగా ఆమోదించినట్లుగా చిత్రీకరిస్తూ ప్రజలను మోసం చేస్తోందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాటి సీఎం కేసీఆర్, ఎంపి వినోద్ కుమార్‌ల కృషి ఫలితంగా ఎన్‌హెచ్ 563 మంజూరైందని అప్పుడే టెండర్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. గతంలోనే భూసేకరణ, పరిహారం చెల్లింపులు కూడా జరిగాయని, కరీంనగరవరంగల్ మధ్య పనులు 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అప్పటికే మంజూరైన పనులను తామే కొత్తగా తెచ్చినట్లుగా బండి సంజయ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తట్టెడు మట్టి కూడా తీయకుండా పదే పదే పనులు ప్రారంభించామంటూ ఎంపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఈ మోసపూరిత ప్రకటనలను గమనిస్తున్నారని అభివృద్ధిని అడ్డుకుంటూ రాజకీయ లబ్ధి పొందడం తగదని ఆయన హెచ్చరించారు.

## రాష్ట్ర కుంగ్‌ఫూ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం తెలంగాణ స్టేట్ ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వోడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి శేఖర్, కోశాధికారిగా కస్తూరి ప్రవీణ్, గౌరవ అధ్యక్షులుగా రాజమల్లు, ఉపాధ్యక్షులుగా రవి, బాలు, సంజీవ్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీకాంత్, ప్రసాద్, అడ్వైజర్లుగా రాజేందర్, రమేష్, చందు, రమేష్, ఈసీ మెంబర్లుగా సౌమ్య, రహమదుల్లా, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ కుంగ్‌ఫూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## విశ్వకర్మ లెజెండ్ అవార్డు అందుకున్న నగునూరి రమేశ్ చారి

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ చింతకుంటకి చెందిన నగునూరి రమేశ్ చారికి విశ్వకర్మ లెజెండ్ అవార్డు 2026 దక్కింది. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ప్రోగ్రాంలో నగునూరి రమేశ్ చారికి విశ్వకర్మ లెజెండ్ అవార్డును ప్రధానం చేశారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకులు విశ్వనాథుల పుష్పగిరి, కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏసీపీ కిరణ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారీ చేతులమీదుగా నగునూరి రమేశ్ చారి ఈ పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డు దక్కిన సందర్భంగా రమేశ్ చారి మాట్లాడుతూ విశ్వకర్మ లెజెండ్ అవార్డు రావడం గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. భారతదేశంలోనే కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ హ్యాండీక్రాఫ్ కళకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ దిశలోనే ఈ కళను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గుర్తించి ప్రోత్సహించారన్నారు. ఈ అవార్డు తన పట్ల మరింత బాధ్యతను పెంచిందని విశ్వకర్మల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## సింగిల్‌విండో కుటుంబ సభ్యునికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/చొప్పదండి :** మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన సింగిల్‌విండో కుటుంబ సభ్యుడు బైరగొండ లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా సంఘం తరపున చైర్మన్ వెల్మ మల్లారెడ్డి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నాంపల్లి మల్లయ్య, గ్రామ సర్పంచ్ మడిపల్లి సంజీవ్, మంద రవి, నాయకులు మునగాల చందు, సీఈఓ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలలోనీ బ్యాటరీ దొంగల అరెస్టు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గత కొంతకాలంగా గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన టిఫైబర్ టి ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను జగిత్యాల రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించి వారి వద్ద నుంచి సుమారు రూ.4.52 లక్షల విలువైన దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్ పత్రిక సమావేశంలో వెల్లడించారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం ధరూర్ గ్రామ శివారులోని జగిత్యాల బైపాస్ రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం సమీపంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళ్తున్న టీజీ 21టి 1774 నంబరు గల ఆటో రిక్షాను తనిఖీ చేయగా, అందులో భారీ సంఖ్యలో బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలు లభ్యమయ్యాయి. వెంటనే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, టిఫైబర్ పరికరాల దొంగతనాలకు పాల్పడినట్లు వారు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ముగ్గురు కలిసి గత నెల రోజులుగా జగిత్యాల రూరల్ మండలం ధర్మారం, లక్ష్మీ పూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుట్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన టిఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడి దొంగిలించిన బ్యాటరీలు, యూపీఎస్‌లను ఆటోలో తరలించి ఒకచోట నిల్వ చేసి, విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో పట్టుకున్నట్లు జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్ తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా నిందితులను గమనించి పట్టుకున్న పోలీసు సిబ్బందిని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ అభినందించారు.

## తల్లి పేరుతో మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



**ప్రజాపక్షం/పెగడపల్లి :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని మద్దులపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ వెల్మా బాలరాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి,దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడబడటమే కాకుండా, గ్రామాలు మరింత పచ్చదనంతో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నదీమ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామ సభలు

**ప్రజాపక్షం/పెగడపల్లి:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పెగడపల్లి మండలంలోని అయితుపల్లి, మ్యాకవెంకయ్యపల్లి, నరసింహునిపేట, నామపూర్, నందగిరి గ్రామ పంచాయతీలలో గురువారం 7 ప్రధాన అంశాలపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ముఖ్యంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, మొక్కల పెంపకం వన మహోత్సవము, వరద నిర్వహణ భద్రత మరియు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితా సవరణ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈ ప్రేమ్ సాగర్, ఎంపీ ఓ పి.శశి కుమార్ రెడ్డి,స్థానిక సర్పంచ్‌లు,మ్యాకల అంజమ్మ మల్లయ్య, జీల రాకేష్ యాదవ్,సంధి రాజమణి మల్లారెడ్డి, చిర్ర రజిత రమణాకర్, ధనాల రజిత సురేష్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అమ్మితే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతాం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాల పేరుతో తల్లిదండ్రులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తూ ఆర్థిక దోపిడీ చేస్తే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని విద్యార్థి యువజన సంఘాలు హెచ్చరించాయి.ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల నాయకులు బి దుర్గాప్రసాద్, కే సాగర్, బి ప్రసన్న, బి వంశీకృష్ణ, మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు ఎవ్వరు పుస్తకాలు ముద్రించి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని ఈ క్రమంలోనే గురువారం రోజు సప్తగిరి కాలనీలోని ఒక ఇంట్లో అక్రమంగా నిలువ చేసి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన సప్తగిరి కాలనీ శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం యొక్క పాఠ్యపుస్తకాలను నిల్వచేసిన గదిని సంబంధిత విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎంఈఓ పిఆర్సి శ్రీలత సంబంధిత గదిని సీజ్ చేపియడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాల ద్వారానే పాఠాలు చెప్పాలని నిబంధన ఉన్నప్పటికీ అవి ఏమీ మాకు వర్తించవనే విధంగా పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు వారి విద్యాసంస్థలు ముద్రించిన పాఠ్యపుస్తకాలనే అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీ చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా తీవ్ర నష్టం కలిగించే విధంగా చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు.

## సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సద్వినియోగం



**ప్రజాపక్షం/రామగిరి:** సూపర్ స్పెషాలిటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్.జి.త్రీ, ఎపిఎ అధికార ప్రతినిధి బి.సుదర్శనం గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.సింగరేణి ముఖ్య వైద్యాధికారి సూచనల మేరకు, తేది:07–06–2026 ఆదివారము రోజున ఏరియా హాస్పిటల్, రామగుండం1 నందు సూపర్ స్పెషాలిటి మెడికల్ క్యాంపు నిర్వహించబడుచున్నది. అస్టర్ ప్రైమ్ హాస్పిటల్ హైదరాబాద్ నుండి కార్డియాలజీ (గుండె సంబంధిత వ్యాధులు), న్యూరాలజీ (నరాల సంబంధిత వ్యాధులు), యూరాలజీ (మూత్రపిండాల శస్త్రచికిత్స),నెఫ్రాలజీ (కిడ్నీ సంబంధిత వ్యాధులు), గ్యాస్ట్రో ఎంటరాలజీ (జీర్ణకోశ వ్యాధులు) ఇట్టి విభాగాలకి సంబంధించిన సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్స్ ఈ క్యాంపునకు రావడం జరుగుచున్నది.సూపర్ స్పెషాలిటీ క్యాంపు నందు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఏరియా హాస్పిటల్ రామగుండం నందు శనివారం సాయంత్రంలోగా తమ హాస్పటల్ బుక్ తో రిజిస్ట్రేషన్ చెసుకొనగలరు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారు మాత్రమే సూపర్ స్పెషాలిటి క్యాంపుకు అనుమతించబడతారు.తేది: 07–06–2026 ఆదివారము రోజున ఏరియా హాస్పిటల్, రామగుండము నందు జరుగనున్న సూపర్ స్పెషాలిటి వైద్య శిభిరంలో పాల్గొని ఇట్టి అవకాశం సద్వినియోగించుకొనగలరని తెలియజేయనైనది.రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పనిచేయుచున్న అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, సిపిఆర్ఎంఎస్ ఈ సిపిఆర్ఎంఎస్ ఎన్ కార్డు కలిగిన రిటైర్డ్ ఉద్యోగులు, వారి భార్య/భర్తలు,అన్ని గనుల,విభాగాలలో పనిచేయు అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఇట్టి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మండలంలో మూడు ప్రైమరీ పాఠశాలల ప్రారంభం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలో మూడు ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీ ఆరేపల్లి రాజయ్య తెలిపారు. ఎంఎంపిఎస్ ఉర్దు మీడియం సుల్తానాబాద్ ,ఏం ఏం పీ ఎస్ అశోక్ నగర్ సుల్తానాబాద్ ఏం ఏం యుపిఎస్ నారాయణరావు పల్లి పాఠశాలలలో ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య తెలిపారు. ప్రి ప్రైమరీ ఇంస్ట్రక్టర్ పోస్ట్ నకు (10+2) ఇంటర్మీడియట్ సమాన విద్యార్హతలు కలిగి ఉండాలని, ప్రారంభ బాల్య విద్య ( ఇసిఇ ) అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఆయా పోస్ట్ కు ఏడవ (7) వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో మొదట ఆ హాబిటేషన్ వారికి, అనంతరం ఆ గ్రామపంచాయతీ వారికి ,అనంతరం ఆ మండలం లోని వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల తేదీ నాటికి 18 నుండి 44 సంవత్సరాల మధ్యన వయస్సు ఉండాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యస్‌సి/యస్‌టి/బిసి/ఇబిసిలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హతల మరియు సంబంధిత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద తేదీ,: 09.06.2026 సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభను గురువారం నిర్వహించారు. వర్షాకాలం సమీపించడంతో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి తగు జాగ్రత్తలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు సూచించారు.అదేవిధంగా కుస్తాపూర్, గొర్రెపల్లి గుండంపల్లి గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి గ్రామాలలో నెలకొన్న సమస్యలు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మార్వో రామచందర్ ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచులు చిట్యాల లక్ష్మణ్ ఏలేటి వెంకట్ రెడ్డి డప్పుల పద్మా నరసయ్య జెల్లా రాజేశ్వర్,ఉప సర్పంచ్లు గడ్డం సోమారెడ్డి సరిచకేల మహిపాల్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకవర్గాల సభ్యులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సంగెం శ్రీరాంపూర్ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఓబులాపూర్ గ్రామాన్ని ఆనుకొని ఉన్న సంగెం శ్రీరాంపూర్ భూముల అమ్మకాలు కొనుగోలు విషయంలో జరిగే రిజిస్ట్రేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఓబులాపూర్ గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి, ఓబులాపూర్ తండా సర్పంచ్ లకావత్ కాంతి జవహర్లాల్ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం తాసిల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. గతంలో జరిగిన అక్రమాల కారణంగా అసలైన రైతులు అమ్ముకోవాలన్న కొనుగోలు చేయాలన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రిజిస్ట్రేషన్ విషయంలో మోకా మీద విచారణ చేపట్టిన తర్వాతే పట్టాలు చేయాలని వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు.

## లింకు రోడ్లను బిటి రోడ్లుగా మార్చేందుకు కసరత్తు

**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో గతంలో ఉన్న లింకు రోడ్లను పూర్తిస్థాయిలో బీటీ రోడ్లుగా మార్చడానికి అధికార యంత్రాంగం వేగంగా కసరత్తులు చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏడుమోటలపల్లి నుండి నంచర్ల మీదుగా రంగాదాములపల్లి వరకు, మద్దులపల్లి తండా నుండి పెగడపల్లి వరకు, అలాగే మద్దులపల్లి తండా నుండి వెంగళాయిపేట్ మీదుగా లింగాపూర్ వరకు ఉన్న వివిధ లింకు రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఈ లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడానికి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించేందుకు గురువారం ట్రైబల్ ఏఈఈ మాధురి,పంచాయతీ రాజ్ డిఈఈ అశ్విన్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు క్షేత్రస్థాయిలో మొత్తం రోడ్ల మార్గాలను నిశితంగా పరిశీలించారు. ఈ రోడ్ల నిర్మాణంతో తండాల నుండి వివిధ గ్రామాలకు రవాణా సౌకర్యం మరింత సులభతరం కానుంది. ఈ రోడ్ల పరిశీలన కార్యక్రమంలో రాములు గౌడ్, తిరుపతి, నంచర్ల ఉపసర్పంచ్ ఎడ్ల శ్యాంసుందర్, మండల నాయకులు తిరుపతి, మహేష్, సత్యనారాయణ రెడ్డి,రవి నాయక్ పలువురు స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణం లోని అంగడి బజార్ లో గురువారం తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగలో భాగంగా జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ పునుగోటి పవన్ రావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు..ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ మాధవి మరిపెల్లి, జిల్లా ఇంఛార్జ్ చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులునీలగిరి రాజేందర్, నందు నాయక్, కొల్లూరి వేణు పటేల్, పురుషోత్తం రావు, శ్రీకర్, వొద్దినేని వెంకటేష్ ,రిజ్వాన్, సుజాత, యుగేందర్, రమేష్, రవీందర్ నాయక్, రవి, మ్యాక మారుతి, వంశీ, నరేందర్, సోమయ్య,రవి ప్రసాద్ ,ప్రదీప్, సునీల్ పాల్గొన్నారు.

# మోదీ, ఎంపి అరవింద్ చిత్రపటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో 190 కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.7,597 కోట్లు మంజూరు చేయడాన్ని నాయకులు స్వాగతించారు. ఎన్‌హెచ్63 ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల నాలుగు లైన్ల విస్తరణకు,జగిత్యాల–కరీంనగర్ ఫోర్‌లైన్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. నిధుల మంజూరులో ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుంచు రణధీర్,పంతంగి వెంకటేష్ యాదవ్,తీగేలా శ్రీధర్ రెడ్డి,దగుల్ల అశోక్,బిజెపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## భూ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** భూ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సుల్తానాబాద్ మండల వ్యవసాయ అధికారిని పైడితల్లి అన్నారు.భూసార పరిరక్షణే ధ్యేయంగా వ్యవసాయ శాఖ వారు నిర్వహిస్తున్న ఖేతి బచావో భూసార పరిరక్షణ కార్యక్రమం మండలంలోని ఐత్రాజపల్లి, దుబ్బపల్లి, భూపతిపూర్, సాంబయ్యపల్లి, నారాయణరావు పల్లి, నర్సయ్యపల్లి, బొంతకుంటపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో గ్రామ సభలో,సుల్తానాబాద్ మున్సిపాలిటీ వార్డు సభలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు మున్సిపాలిటీ వార్డు సభకు విచ్చేసి రైతులకు పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని తెలియజేశారు.జిల్లా వ్యవసాయ అధికారి, శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా వర్షభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన జొన్న అపరాల పంటలు అలసంద, పెసర, మినుము, కంది వంటి పంటలు వేసుకోవాలని, నీటి వసతి ఉన్న దగ్గర వరిలో స్వల్పకాలిక రకాలు వేసుకోవాలని రైతులకు తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరిఖిల్ల నుండి శాస్త్రవేత్త డా.కిరణ్ హాజరై, భూసార పరిరక్షణ కొరకు ముఖ్యంగా మట్టి నమూనా సేకరించి వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా కేవీకే వారికి ఇచ్చినట్లయితే పరీక్ష చేయించి వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదు వాడుకోవాలని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి పైడితల్లి మాట్లాడుతూ పంట పొలాల్లో వ్యర్థాలు కాలబెట్టడం వలన భూసారం దెబ్బతినడం తో పాటు వాయు కాలుష్యం కలుగుతుంది కాబట్టి పంట వ్యర్థాలను భూమిలో కలియ దున్నడం వలన అవి మరల వేసే పంటకు ఎరువుగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవీకే శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారి తో పాటు ఏఈఓలు రాజు,ఆనందరావు,రవితేజ,ప్రశాంత్,అనూష ,రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా సార్గమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం సోమన్ పెల్లి గ్రామంలో శ్రీ సార్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆధ్వర్యంలో విగ్రహ ఊరేగింపు డప్పు, చప్పుళ్ళు మధ్య నిర్వహించారు. అనంతరం వేదం పండితుల మంత్రోత్సహాలతో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెపుల గంగన్న, ఉప సర్పంచ్ గొనె మల్లేశం,నాయకులు ఎర్ర గంగ సాగర్,గర్వకుర్తి భూమయ్య,గొనె గంగాధర్,కంది అంజిరెడ్డి, గజ్జి సతీష్, బత్తిని మహేందర్,తదితరులు ఉన్నారు

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ప్రజాపాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతం గా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజగౌడ్ పేర్కొన్నారు.ప్రజాపాలన – ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మున్సిపల్ పరిధిలో నిర్వహించిన వార్డు సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు.సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ లతో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.అలాగే వార్డు పరిధిలో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు మరియు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు,వార్డు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామ సభలు నిర్వహణ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. వర్షాకాల ముందస్తు చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వనమహోత్సవం, సురక్షిత త్రాగునీరు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయ జాగ్రత్తలు, మహిళా సంరక్షణ, అరైవ్–అలైవ్ అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా అమ్మక్కపేట, కోమటికొండాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో సీహెచ్ గణేష్ శానిటేషన్, పరిశుభ్రత, త్రాగునీటి భద్రతపై అవగాహన కల్పించగా, తహసీల్దార్ బి ఎస్ ఎస్ వరప్రసాద్ ఎస్‌ఐఆర్–ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వివరించారు. ఎస్ఐ నవీన్ మహిళా భద్రత,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాశి రెడ్డి భాస్కర్, కొప్పుల పద్మజ, మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సరిత, సోనీ, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షితమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకొని పలు సూచనలను చేశారు. ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నరు. వాహనదారులు తమ స్వీయారక్షణార్థం,కుటుంబ క్షేమం కొసం తప్పని సరిగా హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని,మైనర్ డ్రైవింగ్ పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు గ్రామాల్లో ఉన్న రహదారి భద్రతా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీల పాత్ర కీలకమని తెలిపారు.మహిళలు, యువతులు, బాలికలు జిల్లా షి టీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్, కాలేజ్, పని చేసే ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులు ఎదురుకుంటే నిర్భయంగా షి టీమ్ నంబర్ 87126 56425 నంబర్ ని సంప్రదించాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా లీగల్, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ ఉపేందర్ చారి,వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.



## 9న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జూన్ 9 మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో 30 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, లోన్ ఆఫీసర్, కస్టమర్ రిలేషన్ అసోసియేట్, పోస్టులు పెద్దపల్లి,కరీంనగర్,మంచిర్యాల్, హుజురాబాద్,జనగాం,నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట,నర్సంపేట్,పరకాల,మహబూబాబాద్, నిజామాబాద్,ఆదిలాబాద్, బోధన్,ఇచ్చోడా ఆర్మూర్, నిర్మల్, ప్రాంతాలలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.విద్యార్హతలు ఇంటర్ ఆపై పూర్తి చేసినవారు ఫ్రెష్, పని అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని, 19 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 09 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో పెద్దపల్లిలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం,మొదటి అంతస్తు, రూమ్ నెంబర్. 233, హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భార్యను హింసించి మెడకు చున్నీ బిగించిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాపక్షం/బీర్పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రానికి చెందిన నేరెళ్ల నరేష్ కు బుగ్గారం మండలంలోని మద్దునూరు గ్రామానికి చెందిన యువతి కి 13 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడ పిల్ల సంతానంగా కలరు.నరేష్ ఎప్పుడు తన భార్యను కొడుతూ, తిడుతూ ఉండేవాడు.ఈ క్రమం లో ఫిబ్రవరి నెల లో నరేష్ పై బీర్పూర్ పోలీస్ స్టేషన్లో గృహ హింస చట్టం కింద కేసు నమోదు జరిగింది.అయినా కూడా అతను తన తీరు ను మార్చుకోకుండా బుధవారం అర్ధ రాత్రి తన భార్య ను క్రికెట్ లో వాడే వికెట్ బాట్ తో కొడుతూ , మెడ చుట్టూ చున్నీ బిగించి హత్య యత్నం చేయగా , వారి పిల్లల ద్వారా సమాచారం అందుకున్న బీరు పూర్ పోలీసులు అంతలో అక్కడికి చేరుకోగా పోలీసులను చూసి పారిపోగా గురువారం పోలీసులు అతడిని పట్టుకొని అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి జగిత్యాల కోర్ట్ ముందు హాజరు పరిచిన బీరుపూర్ ఎస్సై.

## బీర్పూర్ మండలంలో కరెంట్ షాక్‌తో గేదె మృతి

**ప్రజాపక్షం/బీర్పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం విద్యుత్ ఘాతానికి గురై ఒక గేదె మృతి చెందింది.గ్రామానికి చెందిన కొల్లూరి మల్లేశం అనే రైతుకు చెందిన గేదె మేత కోసం వెళ్లిన క్రమంలో అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచెకు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ సతీష్, అసిస్టెంట్ లైన్‌మెన్ శేకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ జితేందర్, వార్డు సభ్యులు మల్లేశం, భూమేష్, సుభాష్,తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు.నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## గ్రామప్రజల సహకారంతోనే గ్రామం మరింత అభివృద్ధి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామ ప్రజల సహకారంతోనే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని సుల్తానాబాద్ మండలం నరసయ్య పల్లి గ్రామ సర్పంచ్ డాక్టర్ జూపల్లి తిరుమల రావు అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచ్ తిరుమల్ రావు అధ్యక్షతన గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు వివిధ శాఖ అధికారులు పలు సూచనలు సలహాలు చేశారు. సర్పంచ్ తిరుమల్ రావు మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లో కోయకాళ్ల తగలబెట్టకూడదని దీనితో భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని రైతులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విజయ రమణారావు సహకారంతో గ్రామ ప్రజలు కోరినట్లుగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత, వార్డు సభ్యులు, మహేష్, ఏఈఓ, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలలకు నోటుపుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి వై.తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలను అందజేయడంతో మండల విద్యావనరుల కేంద్రంలో ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈఓ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యను మరింతగా ప్రోత్సాహించేందుకు ఈ విద్యా సంవత్సరానికి గాను నిజాంసాగర్ మండలానికి 19,900 పుస్తకాలు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు బింగి శ్రీధర్‌కుమార్, పి.నర్సింలు, వరలక్ష్మీ, ఐఈఆర్‌పీలు గైని చిన్నసాయిలు, డి.సునిల్, మెసెంజర్ పంచాక్షరి, అన్ని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రజలకు అవగాహన

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ చట్టాలపై అటవీశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ చట్టం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం, వీటి వలన కలిగే దుష్పరిణామాల గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

## బంజపల్లిలో గ్రామ సభ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని బంజపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామసభలో మండల ప రత్యేకాధికారి కుటుంబరావు, తహసీల్దార్ భుజంగరావు గ్రామప్రజలు పాల్గొనగా ఈ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట మార్పిడి గురించి, ఆరోగ్య సమస్యలపై, వర్షాకాలంలో ఏర్పడే కరెంటు సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపాధిహామీ పథకం, రోడ్డు భద్రత తదితర అంశాలను గురించి ప్రజలకు తెలియజేశారు.

## చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / జన్నారం :** కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు, జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, కేంద్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ముజఫర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి చల్లా వంశీచంద్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పురపాలికను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. గురువారం కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్ నుంచి తిరందాజ్ టాకీస్ చౌరస్తా వరకు గల రహదారిని మున్సిపల్ అధికారులు, స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి రోజు మురుగు కాలువలు శుభ్రపరచడంతో పాటు తడి, పొడి చెత్తను సేకరించాలని సూచించారు. పట్టణంలోని గురుకృప టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నీటిని, వినియోగించిన ప్లేట్లను రోడ్డుపై పడవేసినందుకు ఆ యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతిని ఆదేశించారు. దుకాణాల యజమానులు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్లను రోడ్డుపై పడవేయకుండా చెత్త కుండీల్లోనే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# బీరయ్య ఆలయ నిర్మాణానికి గుంట శ్రీశైలం విరాళం

**ప్రజాపక్షం / నెన్నెల/ బెల్లంపల్లి :** నెన్నెల మండలం కొత్తూరు గ్రామంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీ బీరయ్య దేవుడు కామరాతి నాగవల్లి ఉత్సవాల్లో బుధవారం కురుమ సంఘం మంచిర్యాల జిల్లా నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీరయ్య దేవుని ఆలయ నిర్మాణం కోసం కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం రూ.10,116 నగదును కులపెద్దలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురుమల ఐక్యతే సమాజాభివృద్ధికి బలమని, జిల్లాలోని కురుమల సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో బీరయ్య దేవుని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ సంప్రదాయాలను భావి తరాలకు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోర రంజిత్, ప్రధాన కార్యదర్శి కొంగ మధు, జిల్లా యువత అధ్యక్షుడు కేటీపీపీ మున్సిపల్ కౌన్సిలర్ వేనంక శ్రీనివాస్, జిల్లా మహిళా నాయకురాలు అల్లి రాజమణి, అల్లి మల్లేష్, కొంగొండ రాజు, కట్న మల్లేష్, కొంగొండ ప్రశాంత్, గ్రామ కులపెద్దలు కట్న భీరేష్, కటికల బీరయ్య, బొర్రాల మోహన్, కులస్తులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ప్రత్యేక చొరవ

**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం అందించడమే లక్ష్యంగా మందమర్రి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు నేతృత్వంలో ఆరు వార్డుల పరిధిలోని పలు కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల శుభ్రత, పూడిక తొలగింపు, తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను వెంటనే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా చూడటం, పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడం, వీధి దీపాల నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 అమలు, జల్ సంచయ్–జనభాగీదారి కింద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటు, మొక్కల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వార్డు నెం.1లో దుర్గామాత షెడ్, వార్డు నెం.2లో శ్రీరామ గ్రౌండ్, వార్డు నెం.3లో అయ్యప్ప దేవాలయం వాటర్ ట్యాంక్, వార్డు నెం.4లో కమ్యూనిటీ హాల్, వార్డు నెం.5లో ఆర్కె 1 సుభాష్‌నగర్ ట్యాంక్, వార్డు నెం.6లో రామకృష్ణాపూర్, నర్లాపూర్ యూపీఎస్ పాఠశాలల వద్ద ఈ సభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ వి. వసంత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. గోపీకృష్ణ, సిస్టమ్ మేనేజర్ ఏ. శిరీష్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు, మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సుభాష్‌నగర్ వార్డులో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, బస్తీవాసులు సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్‌కు వినతిపత్రం సమర్పించారు. వార్డులో ప్రతిరోజూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేయాలని, నూతన సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించి, చెత్త సేకరణ ట్రాలీ ప్రతిరోజూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పిచ్చి మొక్కల తొలగింపు, పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు, చెడిపోయిన బోర్‌వెల్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. కోతుల బెడద కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మామిడి గోపి, వంశీకృష్ణ, సంజయ్, కళ్యాణ్‌రామ్, రవి, పున్నం, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయం ఐదుగురి అరెస్ట్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ టౌన్:** నకిలీ పత్రాల ఆధారంగా ప్లాట్ విక్రయించి మోసానికి పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు మావల సిఐ బి.డి ప్రేమ్‌కుమార్ తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన పలమూరి జయప్రకాశ్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. బట్టి సావర్గావ్ శివారులోని సర్వే నెంబర్ 65లో గల ప్లాట్‌కు సంబంధించి నిందితులు కే.వేణుగోపాల్, రత్నాల రాజన్న, కేతిరెడ్డి కృష్ణారెడ్డి,దరాడే కేశవ్‌తో పాటు డాక్యుమెంట్ రైటర్ మొహమ్మద్ ఫైజుద్దీన్ సిద్దిఖీ కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిపి ఫిర్యాదు దారుడిని మోసం చేయడంతో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆస్తులు కొనుగోలు చేసే ముందు లింక్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించుకోవాలని సూచించారు.

## పేదల సొంతింటి కల నిజం చేస్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ఇల్లులేని నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం నిజం చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బట్టిసావర్గావ్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణవేణి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

గ్రామస్థుల ప్రతిజ్ఞ



**ప్రజాపక్షం/తలమడుగు:** తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలోని రైతువేదిక భవనంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పిస్తామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సురక్షిత తాగునీరు అందించాలని తలమడుగు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ రాజమోహన్, సర్పంచ్ మెస్రం దేవ్‌రావు, ఉపసర్పంచ్ రంజిత్ రెడ్డి, గ్రామ పెద్ద ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఎస్ఐ రాధిక, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ఇరిగేషన్ ఈఈగా కిమ్యానాయక్

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ డివిజన్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కిమ్యానాయక్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. లోగడ నిజామాబాద్ ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఈఈగా ఈయన పనిచేశారు. ఈ మధ్యకాలంలో జరిగిన బదిలీల్లో నిజాంసాగర్ ఈఈగా నియామకమయ్యారు. లోగడ పనిచేసిన ఈఈ సోలోమాన్ నారాయణపేట్‌కు బదిలీపై వెళ్ళారు. నిజాంసాగర్ డివిజన్ పరిధిలో ఇరిగేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కిమ్యానాయక్ పేర్కొన్నారు.

## బీమా చెక్కు అందజేత



ప్రజాపక్షం / కౌటాల : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.రెండు లక్షల బీమా క్లెయిమ్ చెక్కును రవీంద్రనగర్‌కు చెందిన ఇప్ప సుజాతకు అందజేశారు. గురువారం బ్యాంకులో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై, ఎపివై భీమా పథకాలతో పాటు పంట రుణాలు, జీరో వడ్డీ రుణాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సామాజిక భద్రతా పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరాలని శాఖ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీనివాస్, వాసు, ప్రదీప్, విజయ్, ఎఫ్ఎల్‌సి కన్వీనర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

## జైనూర్‌లో భారీ వర్షం




ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కుండపోతగా భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం పెద్ద ఉపశమనం కలిగించింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వాతావరణం చల్లబడింది. రహదారులపై నీరు భారీగా చేరి ప్రవహించగా చిన్నారులు, యువకులు వర్షంలో తడుస్తూ ఆనందంగా ఆస్వాదించారు. ఎండ తీవ్రత నుంచి ఊరట లభించడంతో స్థానిక మార్కెట్ ప్రాంతాలు, నివాస సముదాయాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వర్షం పట్ల రైతులు ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు పనుల ప్రారంభానికి, భూమిలో తేమ శాతాన్ని పెంచడానికి ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిస్తే పంటల సాగుకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కల్యాణలక్ష్మీ, షాదీ ముబారఖ్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం / భైంసా : భైంసా పట్టణంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముభారఖ్ లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా రూరల్‌కు సంబందించిన లబ్దిదారులకు మొత్తం 185 చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంపిణీ చేశారు. ఈ సంధ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు సమాజంలోని పేద మరియు మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రెబ్బన రైల్వే గేటుతో వాహనదారుల నిరంతర ఇబ్బందులు



ప్రజాపక్షం / రెబ్బన : ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలంలోని నంబల–గంగాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటు వాహనదారులకు నిత్య శాపంగా మారింది. గేటు పడిందంటే చాలు వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, రైల్వే గేటు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులపై బయలుదేరిన వారు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు గేటు వద్దే చిక్కుకుపోతున్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే అంబులెన్సులు కూడా గేటు వద్ద నిలిచిపోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటు మూసివేసిన సమయంలో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. ఈ రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ గానీ, ఫ్లైఓవర్ గానీ లేకపోవడం ప్రజల ఇబ్బందులకు ప్రధాన కారణమని వాహనదారులు పేర్కొంటున్నారు. అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఇలాంటి సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ గేటు ప్రాణాలకు కూడా ముప్పుగా మారే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి అండర్‌పాస్ లేదా ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టి ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన




ప్రజాపక్షం / జన్నారం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బక్కయ్య సూచించారు. జన్నారం మండలం కలమడుగు గ్రామంలో గురువారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని పేర్కొన్నారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్, ఉపసర్పంచి లింగయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య, పశువైద్యాధికారి శ్రీకాంత్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా భాగస్వామ్యంతో వార్డు అభివృద్ధికి ప్రాధాన్యం



ప్రజాపక్షం / కాగజ్ నగర్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం వార్డు నం. 5లో ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. సభలో వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలు, అభ్యర్థనలను అధికారులు నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో వార్డు అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును సమర్థవంతంగా కొనసాగించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, కమిషనర్ బి తిరుపతి,కౌన్సిలర్లు ఇమ్మడి పోచయ్య, మిట్టపల్లి కమల, సిబ్బంది, వార్డు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చిట్యాలలో పక్షవాతం బాధితులకు అండగా నూతన వైద్య కేంద్రం

ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : నిర్మల్ మండలం చిట్యాల గ్రామంలోనూతనంగా ఏర్పాటు చేసిన పక్షవాతం చికిత్స, పునరావాస కేంద్రాన్ని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షవాతంతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. పక్షవాతం బాధితులు కోలుకునే ప్రక్రియలో వైద్య చికిత్సతో పాటు పునరావాస సేవలు కూడా కీలకమని, ఈ కేంద్రం ద్వారా బాధితులకు సమగ్ర సేవలు అందనున్నాయని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తూ, దీని ద్వారా అనేక మంది రోగులు ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నిర్మల్ నియోజక వర్గ ఇంచార్జి శ్రీహరిరావు, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, అల్లోల సురేందర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ సభ్యుడు రాజేవ్వర్ రెడ్డి, శ్రీనివాస్ మల్లేష్, ముడుసు సత్యనారాయణ, పాకాల రాంచందర్, శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, సాగర్‌రావు, రవి కిరణ్, సాయి కృష్ణ, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## అక్రమ మట్టి, ఇసుక తరలింపుపై కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ కె. హరిత



ప్రజాపక్షం / కాగజ్‌నగర్ : సరైన అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె హరిత హెచ్చరించారు. గురువారం కాగజ్‌నగర్ మండలం గన్నారం మాండవ, ఆరెగూడ, అనుకొడ గ్రామాల్లోని చెరువులను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నజ్రుల్ నగర్ విలేజ్ నెం.12 గ్రామ పరిధిలో మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. వాటికి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించడంతో ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎవరైనా అక్రమంగా మట్టి లేదా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రవాణా చేపట్టే ముందు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి కన్నుమూత



ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి ఏరియాలోని సింగరేణి ఎస్‌ఎండ్‌పిసి విభాగంలో జూనియర్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బరారి చంద్రమౌళి ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం రాత్రి ఆయనకు అకస్మాత్తుగా తీవ్ర ఆయాసం రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక డిస్పెన్సరీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. చంద్రమౌళి మరణ వార్త తెలిసిన వెంటనే సహోద్యోగులు, అధికారులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సహృదయ స్వభావంతో అందరి మన్ననలు పొందిన ఆయన మరణం సింగరేణి ఉద్యోగ వర్గాల్లో విషాదాన్ని నింపింది. ఈ వార్త తెలుసుకొని పలువురు సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, సహోద్యోగులు ఆయనకు నివాళులు అర్పించారు.

## సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్లు విక్రమ్, నరేష్, అనస్తీషియా విభాగానికి చెందిన డాక్టర్లు మధుకర్, రామ్ మైత్రి, ఓటీ విభాగం ఇన్‌చార్జ్ సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో అత్యంత నైపుణ్యంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) మధు కుమార్ మాట్లాడుతూ శస్త్రచికిత్సలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన స్ట్రైకర్ ఇంప్లాంట్స్‌ను వినియోగించినట్లు వెల్లడించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఆసుపత్రి ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమిష్టి కృషితో ఏరియా ఆసుపత్రిలో వివిధ రకాల ప్రత్యేక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## కమిషన్.. కరప్షన్.. కలెక్షన్‌కు అలవాటు పడ్డాడు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా కమిషన్ కరప్షన్.. కలెక్షన్ కు అలవాటు పడ్డాడు కాబట్టే ప్రజలు అతన్ని దూరం పెట్టారని, తన అభివృద్ధి ఆకాంక్షగా పది సంవత్సరాలు పనిచేశాడు. పట్టణ అభివృద్ధిని విస్మరించారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం స్తానిక బిజెపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తనపై తప్పుడు ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే బిగాలపై మండిపడ్డారు.కాంగ్రెస్‌ను ఎదుర్కొనే దమ్ములేక తనపై బిగాల ఆరపణలు చేస్తున్నారన్నారు. పదేళ్ళు అధికారంలో ఉండ తన అభివృద్ధిని చూసుకున్న బిగాల అధికారం లేదనే అసహనంతో తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్దమా అని సవాల్ విసిరారు.. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, బిజెపి ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటి ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, కల్పే అర్చనా చిరంజీవి, మమత శివ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, పాల్గొన్నారు.

## ఫ్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయాల నియమానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులను చిట్టాపూర్, జలాల్‌పూర్,బస్సాపూర్, వన్నెల్(బి) గ్రామాల్లో ప్రారంభించబడుతున్నాయని తెలిపారు. ఇన్స్ట్రక్చర్ పోస్ట్‌కు ఇంటర్మీడియట్, టీటీసీ ట్రేనింగ్‌ఆయా పోస్ట్‌కు 7వ తరగతి ఉత్తీర్ణత అవసరమని, స్థానిక హేబిటేషన్, గ్రామపంచాయతీ, మండల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 1844 సం॥రాల వయస్సు మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు వయో సడలింపు వర్తిస్తుందన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో ఈనెల 9 లోగా ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## ఆర్అండ్‌బి బిటి రోడ్డు,వంతెన మరమ్మతులు చేపట్టాలంటూ వినతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** నియోజకవర్గంలోని భీమ్‌గల్ నుంచి బడాభీమ్‌గల్‌కు వెళ్లే ఆర్అండ్‌బి బీటీ రోడ్డు, వంతెన మరమ్మతులు వెంటనే చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.గత సంవత్సరం వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, వంతెన కూడా పాడైపోయిందన్నారు. రోడ్డు, వంతెన పరిస్థితిని పరిశీలించి మండల బీజేపీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు యోగేశ్వర్, నర్సయ్య, మధు మాట్లాడుతూ గత సంవత్సరం భారీ వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు, వంతెన మరమ్మతుల పేరుతో నామమాత్రపు పనులు మాత్రము చేశారని ఆరోపించారు. ఈ వానకాలం వచ్చేలోగా వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోతే బాల్కొండ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

# వ్యర్థాల నియంత్రణతోనే ప్రకృతి పరిరక్షణ సాధ్యం

### అటవీ శాఖ అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్మల్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేకార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అటవీ కార్యాలయంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వ్యర్థాలను తగ్గిద్దాం ప్రకృతిని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. వేసవి సెలవులు కొనసాగుతున్నప్పటికీ పర్యావరణంపై ఆసక్తి, బాధ్యతతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమని జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబడే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి సంరక్షణ ప్రతి పౌరుడి కర్తవ్యమని, పర్యావరణ సమతూల్యతను కాపాడడం ద్వారా భావితరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం అవసరమని, ఇందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు, సిబ్బంది, పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సందేశాలను విద్యార్థులు తమ రచరనలు, చిత్రాల ద్వారా ప్రతిబింబించడం విశేషంగా నిలిచింది.

## అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పతకాలు తహసీల్దార్ గంగాధర్

**ప్రజాపక్షం/కోటగిరి :** పోతంగల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు గురువారం నిర్వహించి తహసీల్దార్ గంగాధర్ మాట్డాడారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని, ఎరువులు, వాడకటం తగ్గించాలని, ఆహార పంటలపై ప్రత్యేక దృష్టి ఏర్పర్చాలన్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ వీరవంతరావు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, శేషాద్రి పారం, సర్పంచ్ వాసు, ఎస్సై సునీల్, ఎంపీడీఓ విష్ణు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం ద్వారా మంజూరైన పురాణీపేట్ గ్రామానికి చెందిన 2 లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.20వేలు మంజూరయ్యారని ఎంపీడీఓ సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురాణీపేట్ సర్పంచ్ సుమ, టైపెస్ట్ చంద్రశేఖర్ నాయకులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌పై చర్యలు

**ప్రజాపక్షం/ కోటగిరి :** కోటగిరి, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకంలాగా కేక్ కట్ చేసి దానిని సోషల్ మీడియాలో పెట్టడం మన దౌర్భాగ్యమని జాతీయ పతాకానికి అవనమాపర్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు వేముల నవీన్ డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు, హవగిరిరావు, శ్యామ్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన సాయిలుకు సన్మానం

**ప్రజాపక్షం/కోటగిరి :** పోతంగల్ జడ్పీహెచ్‌ఎస్ హెచశ్రీం గురువారం మండల విద్యాధికారిగా పదవీ బాధ్యతలను చేపట్టారు. గతంలో ఎంఈఓగా పని చేసిన శంకర్ పదవీ విరమణ చేయటంతో పదవీ బాధ్యతలను సాయిలు సేకరించారు. స్థానిక ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, రాజేంద్రప్రసాద్, నాగనాథ్, రామరావు, హన్మాండ్లు ఘనంగా సన్మానించారు.

## వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి నితీష్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా మండలంలోని ఖానాపూర్ గ్రామంలో గురువారం ఏఈ నితీష్ స్పెషల్ ఆఫీసర్గా హాజరయ్యారు. సర్పంచ్ బోదాసు నర్సింలు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి పారిశుధ్యం మంచి నీటి డ్రైనేజీలు వర్షాకాలంలో ముందస్తు ప్రణాళిపై తడి, పొడి చెత్త సేకరణపై చర్చించి మాట్లాడారు. గ్రామ పరిశుభ్రతను కాపాడటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కాలకమన్నారు. వారిని గౌరవించటంతో పాటు ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్రామ కార్యదర్శి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## కాలుష్యం నివారించాలంటే ప్రతిఒక్కరూ సహకరించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాలుష్యం నివారించాలంటే ప్రతిఒక్కరూ సహకరించాలని , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్సెస్సార్ కళాశాల అధినేత డాక్టర్ ఎం. మారయ్య గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర పోల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ల మీటింగ్ ఎస్సెస్సార్ కళాశాలలో నిర్వహించామని, ముఖ్యఅతిథిగా మారయ్యగౌడ్ మాట్లాడుతూ పరిశుభ్రత ఎంతో అవసరమని ఈ రోజుల్లో పోల్యూషన్ విచ్చలవిడిగా జరుగుతూ ప్రాణాలకు హానీ తలపెడుతుఆన్నయన్నారు. విద్యార్థులు వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్ష

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, నిజామాబాద్, లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన శనివారం ఉదయం 9 గంటల నుండి పెన్షనర్స్ భవనం, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్ ఎదురుగా, సుభాష్‌నగర్ నిజామాబాద్‌లో నిర్వహించబడుతుందని ఆల్ పెన్షనర్స్, ఉద్యోగుల సంఘం బాద్యులు రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. టి.హనుమాండ్లు ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, ఈవిఎల్ నారాయణ సెక్రెటరీలను 98489 70027, 94401 40300 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వరద కాలువ మరమ్మతు పనుల పరిశీలన

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట్ వద్ద వరద కాలువ మరమ్మత్తులను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ పరిశీలించారు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ వద్ద వరద కాలువకు ఇటీవల గండి పడింది. మరమ్మతుల కొరకు ఇటీవల ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ మరమ్మత్తు పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. పంటల సాగుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోశెట్టి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న జర్నలిస్టు యూనియన్ నాయకులు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ఇటీవల జరిగిన వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న టియూడబ్లూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు పోశెట్టిని గురువారం యూనియన్ జిల్లా నాయకులు పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్ళిన నాయకులు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని దైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొండూరి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, సభ్యుడు డి.ఎస్. మధు, పోశెట్టితో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం నుంచి వేగంగా కోలుకుని తిరిగి జర్నలిస్టు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పోశెట్టి త్వరగా పూర్తిస్థాయిలో ఆరోగ్యం పోందాలని కోరుతూ, అవసరమైన సమయంలో యూనియన్ తరపున అన్ని విధాల సహాకారం అందిస్తామని నాయకులు తెలిపారు. సహచర జర్నలిస్టుల పట్ల యూనియన్‌కు ఉన్న బాధ్యతను మరోసారి చాటుతూ ఆయనకు తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజాపాలనపై వార్డ్‌లో అవగాహన



**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ప్రజాపాలన 99 వ రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఐదవ వార్డులో ప్రజా పాలనపై అవగాహన నిర్వహించి వార్డులో ఏలాంటి పనులు నిర్వహించాలో వార్డ్ కౌన్సిలర్‌తో కలిసి నాయకులు తెలియజేశారు. వార్డులో ఘన వ్యర్థాల న్విహణ నిబంధనలు 2026 జల సంచయ్ జల భాగీదారి కింద వర్షపు నీటి నిల్వ (హార్వెస్టింగ్) నిర్మాణాల ఏర్పాటు కాలువలలో పూడికతీత వర్షాకాల సన్నద్ధత కోసం కార్యాచరణ ప్రణాళిక తాగునీటి సరఫరా నిర్వహణ , నీరు నిల్వ ఉండకుండా నివారించడం పారిశుద్ధయం, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ చర్యలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాలనీ వాసులకు అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మేస పోసమ్మ వార్డ్ ఆఫసీర్ సంజయ్, రాహుల్ లతీఫా, రాజు, అంగన్వాడి చీటర్, పుష్ప వీఓ మంగమ్మ ఆశ వర్కర్ త్రివేణి, నాయకులు మేస సతీష్ నేత శ్యాం, అసీఫ్ వాసి ఖాన్, గంగ నర్సయ్య మెడికల్ గంగాధర్, శిరీష్‌రాజేందర్ , హరీష్, సుందర్, ప్రసాద్, తదితరులు పాల్గన్నారు.

## పాఠశాల గోడ కూలినా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూరిబా బాలికల పాఠశాలలోగత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షం, గాలివానలకు పాఠశాలలో గల చెట్లు పక్కనే ఉన్న 100 మీటర్ల ప్రహారీ గోడపై పడి గోడ విరిగి గత కొద్ది రోజులు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చర్చించుకుకుంటున్నారు. కసీన వసతులలేమిని, బయటకు కనబడకుండా చూపే అధికారులు ఇలా గాలివానతో గోడ పగిలి చాలా రోజులైనా దీనిని పట్టించుకోక పోవడం ఏంటనీ, పాఠశాల ప్రారంభమై పిల్లలు వస్తే వాళ్ళ పరిస్థితి ఏంటీ, కస్బూర్బా పాఠశాలకు పక్కనే ఊర చెరువు ఉండడంతో విష పురుగులు వచ్చే ప్రమాదం ఉందని వర్షాకాలంలో చెరువు నుండీ నీరు ఎక్కువ చ్చి ఊటగా నీరు పాఠశాల లోపలికి పోయే ప్రమాదం ఉందని, ఇకనైనా అధికారులు కస్బూర్బా పాఠశాలపై దృష్టి సారించి గోడకు మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

## ప్రణాళికా లక్ష్యంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాపక్షం / వేలేరు : గ్రామాలను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెల్లడమే రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణే ప్రధాన లక్ష్యమని, గ్రా మాల అభివృద్ధిని ప్రణాళికా లక్ష్యంతోనే అభివృ ద్ధి చెందుతాయని వేలేరు ఎంపిడిఒ కిషన్‌నాయక్ అన్నారు.గురు వారం వేలేరు మండలకేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి అధ్యక్షతన జరిగిన గ్రామస భకు ముఖ్యఅథిధిగా హాజరై గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు,గ్రామసభలు ప్రజ లకు ప్రభుత్వ పథకాలు,సేవలను చేరవేసే అత్యంత ప్రభావవంతమైన వేదికలని పేర్కొ న్నా రు.ఈసంధర్భంగా మండలస్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు మాట్లా డుతూ గ్రామాలలో విద్య,వైద్యం,పారి శుద్యం,పర్యావరణ పరిరక్షణ.గ్రామీణాభి వృద్ధి,వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివా రణ,పంటవ్యర్థాల కాల్చివేత, విద్యుత్ వాడకం ,వ్యవసాయశాఖ సూచనలు మేరకు శాస్త్రీయ పద్దతుల్లో సాగు చేపట్టాలని పంట మార్పిడి విధానాలు పాటించాలని,ఎరు వులు, పురుగుమందుల వినియోగంపై అవ గాహన పెంపొందించుకుని అధికదిగుబ డులు సా ధించాలని పేర్కొన్నారు.గ్రామాల్లో సాలీడ్ లికి ్వడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్ర మాలను సమర్ధవంతంగా అమలు చేయా లని,ప్రతిఇంట్లో తడిపొడి చెత్తను వేరువే రుగా సేకరించే అలవాటు పెంపొందించా లని సూచించారు.పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని సీజనల్ వ్యాదుల నివారణ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు,ఇంటింటికి ఇం కుడు గుంతల నిర్మాణం పర్యావరణ పరిర క్షణ, రోడ్డు భద్రత, మరియు డ్రగ్స్, సైబర్ నేరాలు, గంజాయి వాడకం, మైనర్లకు వాహనాలను అప్పగించడం వలనకలిగే అన ర్థాలపై అవగాహ న కల్పించారు.అనంతరం వేలేరు మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపిడిఒ కిషన్‌నాయక్, ఎంపిఒ బుచ్చిరెడ్డి, గ్రామపంచాయితీకార్యదర్శి విజ యను శాలువాతో సన్మానం చేశారు. కార్య క్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి , ఉపస ర్పంచ్ కోడూరి శ్రీకర్,ఎంపిడిఒ కిషన్‌నా యక్, ఎంపిఒ బుచ్చిరెడ్డి, డా, మేఘన, ఎఒ కవిత,ఎపిఒ విజయ, పిఆర్ఎఇ రూప,విద్యు త్‌శాఖ లైన్‌మెన్ బొల్లికొండ వెంకటేశ్వర్లు, హౌజింగ్ ఎఇ అభిలాష్, ఎస్సై ఎ సురేష్ మహిళా సంఘాల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్రాన్ని అందిస్తున్న ఎంసిపిఐ(యూ) నాయకులు

ప్రజాపక్షం/ నర్సంపేట : మోదీ అనుసరి స్తున్న వినాశకర విధానాలతో నిరుద్యోగం , నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగు తున్నాయని ఎంసిపిఐ(యు) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ పిలుపుమే రకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎంసిపి ఐ(యూ) డివిజన్ కార్యదర్శి ఎం డి రాజా సాహెబ్ అధ్యక్షతన నర్సంపేట ఆర్డీ వో కార్యాలయం ఎదుట నాయకులు ఆందోళన చేపట్టి ఆర్డీవో ఉమారాణికి మెమోరాండం అం దించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన మూడు దఫాల్లో అదే స్థాయిలో నిత్యవసర వస్తువుల ధరలను మూడంతలు పెంచి పేద మధ్యతరగతి ప్రజ లపై మోయలేని చేసి చిత్తశుద్ధి ప్రదర్శించా లని డిమాండ్ చేశారు.

# అంబులెన్స్‌లోనే పురిటి నొప్పులు...

### యాచకురాలికి 108లో సుఖ ప్రసవం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఆపదలో ఉన్న వారికి మేమున్నా మంటూ 108సిబ్బంది మరోసారి తమ మానవత్వాన్ని సమయస్ఫూర్తిని చాటుకున్నారు. అర్ధరాత్రి వేళ పురిటి నొప్పులతో విలవిలలాడుతున్న ఓ యాచకురాలికి అంబులె న్స్‌లోనే సుఖప్రసవం చేసి, తల్లి బిడ్డల ప్రాణాలను కాపా డారు. ఈ మానవతా సంఘటన నిజామాబాద్ జిల్లా ఎడ పల్లి మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎడపల్లి కొత్త బస్టాండ్ వెనుక ప్రాంతంలో సోనీ అనే యాచ కురాలు నివాసముంటోంది. బుధవారం అర్ధరాత్రి ఆమెకు అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడం గమనించిన కుటుంబీకులు వెంటనే అప్రమత్తమై 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే బోధన్ 108అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. గర్భిణీ పరిస్థితిని గమనించి, ఆమెను చికిత్స నిమిత్తం నిజా మాబాద్ జిల్లా మాతా శిశు ఆస్పత్రికి తరలించేందుకు బయలుదేరారు. అయితే ఆస్పత్రికి వెళ్లే మార్గమధ్యంలో సోనీకి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. పరిస్థితి విషమి స్తుండటాన్ని గమనించిన 108 సిబ్బంది ఈఎంటి లక్ష్మణ్, ఫైలట్ కేశవ్ కుమార్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా చాకచక్యంగా వ్యవహరించారు. వాహనాన్ని పక్కకు నిలిపి, అంబులెన్స్‌లోనే సోనికి ప్రసవం చేశారు. 108సిబ్బంది సమయస్ఫూర్తితో చేసిన ఈ ప్రయత్నంలో సోని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లిబిడ్డలను క్షేమంగా నిజామాబాద్ జిల్లా మాతా శిశు ఆస్పత్రికి తర లించి వైద్యులకు అప్పగించారు. ప్రస్తుతం తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి, ఎంతో బాధ్యతగా యాచకురాలికి సుఖ ప్రసవం చేసిన 108సిబ్బంది లక్ష్మణ్, కేశవ్ కుమార్‌లను ఆస్పత్రి వైద్యులు స్థానికులు అభినందిస్తున్నారు.

# పుష్కరిణుల అభివృద్ధికి కృషి

### గంగా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శశిరెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రా లలో ఉన్న పుష్కరిణుల పునరుద్ధరణ, అభివృద్ధికి గంగా చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని ట్రస్ట్ ప్రతినిధి శశి రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎడ పల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జాన్కంపేట్ శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. మాజీ ఎంపీ ఈగ గంగారెడ్డి కుమార్తె అయిన శశిరెడ్డి, ఆలయ ప్రాంగ ణంలోని చారిత్రాత్మక అష్టముఖి కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో కోనేరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కోనేరు ప్రాంత అభివృద్ధికి కావా ల్సిన వసతులు, ఇతర సాధ్యా సాధ్యాలపై దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణంలోని ప్రముఖ నీలకంటే శ్వర ఆలయాన్ని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డితో కలిసి శశిరెడ్డి సందర్శించారు. అక్కడి కోనేరు విశిష్టతను పరిశీలించి, దాని చుట్టు పక్కల ప్రాంతా లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి తాము సంక ల్పించినట్లు వెల్లడించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అసి స్టెంట్ కమీషనర్ విజయ రామారావు, ఆలయ అధికారు లతో ఆమె చర్చించారు. కోనేరుల పునరుద్ధరణ కార్యక్రమా నికి దేవాదాయ శాఖ, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పూర్తి సహ కారం అందించాలని కోరారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్రంలో మూడు కోనేరులను విజయవంతంగా అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. దీనిపై దేవా దాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ విజయ రామారావు స్పందిస్తూ కోనేరుల అభివృద్ధికి సంబంధించిన సమగ్ర నివే దికలను దేవాదాయ శాఖ కమీషనర్‌కు సమర్పిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డీఈ శర్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, ఆలయ ఈవోలు రవీందర్ గుప్తా, వేణు, గ్రామ అధ్యక్షుడు చేపూరి కిషోర్, నాయకులు రాధా కిషన్ గౌడ్, వరదగౌడ్, ఉప్పు సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక స్థలం కబ్జాపై తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఏఆర్పి క్యాంప్ గ్రామ పంచాయతీ పరిధిలో గల స్మశాన వాటిక స్థలం అక్రమ కబ్జాకు గురైందని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ గ్రామస్తులు ఎడ పల్లి తహసీల్దార్ దత్తాత్రికి వినతి పత్రం అందచేశారు. గ్రామా నికి కేటాయించిన స్మశాన వాటిక స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమించారని సర్పంచ్ పురమల్ల వినోద్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు. అక్రమణకు గురైన స్మశాన వాటిక స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సర్వే చేపట్టి సరిహద్దులను నిర్ణయించాలని గ్రామస్తులందరికీ ఉప యోగపడే స్మశాన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. గ్రామస్తుల విన్నపం మేరకు స్పందించిన తహసీల్దార్ ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుం టామని హామీనిచ్చారు.




## ఎడపల్లిలో నేడు భారీ మేకల సంత ప్రారంభం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడ పల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారీ మేకల సంత నేడు అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక యంత్రాంగం ముమ్మరంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ.. నేడు ప్రారంభం కానున్న ఈనూతన మేకల సంత, ఇకపై ప్రతి వారం శుక్రవారం నాడు నిర్వహించబడుతుందని తెలిపారు. బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఈ వారంతపు సంతను ఏర్పాటు చేయడం వల్ల వ్యాపారాస్తులకు, కొనుగోలు దారులకు ఎంతో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా లోని గొర్రెలు, మేకల పెంపకం దారులు వ్యాపా రులు, కొనుగోలు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేడు జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయాలని సర్పంచ్ రాంచందర్ పిలుపునిచ్చారు.

## పాలెంలో బడిబాట




**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ పలిగిరి రాధా రవి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయుల సమాక్షంలో బడిబాట కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర పత్రాలను వారు ఆవిష్క రించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, మంచి బోధన తదితర వాటిపై తల్లిదండ్రులకు వారు అవగాహన కల్పించారు. మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు గోపాల రావు, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, నరసింహ స్వామి, చంద్రశే ఖర్, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

## మద్యానికి బానిసై కూలీ కార్మికుడు ఆత్మహత్య

### నిర్మాణంలో ఉన్న ఇంటి గుమ్మానికి ఉరి వేసుకొని ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఎడపల్లి:** మద్యం మహమ్మారి ఓ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన నవీపేట్ మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫకీరాబాద్ గ్రామా నికి చెందిన చెవాన్ గణేష్(44) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే గత కొంతకాలంగా అతను మద్యానికి బానిసై నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలోనే ఇటీవల వీరికి ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో కొత్త ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇంటి నిర్మాణ ఖర్చుల కోసం గణేష్ భార్య సత్తిబాయి మహిళా సంఘం నుంచి రూ.లక్షతో పాటు తన పుట్టింటి నుంచి మరో రూ. లక్ష తీసుకొచ్చి ఇంట్లో దాచింది. అయితే మద్యానికి బానిసైన గణేష్, భార్యకు తెలియకుండా ఆ డబ్బుల నుంచి కొంత మొత్తాన్ని తీసి మద్యం తాగడానికి ఖర్చు చేయడం ప్రారంభించారు. ఇంట్లో ఉంచిన డబ్బులు తరిగిపోతుండ టంతో గమనించిన భార్య సత్తిబాయి, బుధవారం రాత్రి దీనిపై భర్త గణేష్ ను నిలదీసింది. దీంతో తీవ్ర మద్యం మత్తులో ఉన్న గణేష్ ఆమెతో ఘర్షణకు దిగాడు. గొడవ అనంతరం రాత్రి అతను కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లిపోయాడు. గత నాలుగు రోజులుగా కొత్త ఇంటి నిర్మాణ సామాగ్రిని కాపలా కాయడానికి గణేష్ రాత్రి వేళలో అక్కడే పడుకుంటుండంతో బుధవారం రాత్రి కూడా అలాగే వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. గురువారం ఉదయం ప్రాంతంలో సత్యబాయి కొత్త ఇంటి వద్దకు వెళ్లి చూసే సరికి, గణేష్ ఇంటి గుమ్మా నికి ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. భర్త మృతదేహాన్ని చూసి ఆమె ఒక్కసారిగా కన్నీరుమున్నీరైంది. మద్యం మత్తు రాత్రి జరిగిన కుటుంబ కలహాల కారణంగానే గణేష్ క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడి భార్య సత్తిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు ప్రారంభించారు. కూలి పని చేసుకునే కుటుంబ యజమాని ఇలా ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

